ససేమిరా!

- శాలమ్మ సత్రం స్వాధీనం చేయని యాజమాన్యం
- పెద్దాసుపత్రి ఆదాయానికి గండి
- ఏడాది క్రితమే ముగిసిన లీజు గడువు
- అగ్రిమెంట్ ప్రకారం భవనాన్ని ఆసుపత్రికి అప్పగించాల్సి ఉన్నా పలకని వైనం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని కలెక్టరేట్ ప్రాంతం. నిత్యం రద్దీగా ఉంటుంది. నగరం నడిబొడ్డు కావడం, రాయలసీమ జిల్లాలకు పెద్ద దిక్కు అయిన పెద్దాసుపత్రి, కలెక్టరేట్ ఉన్న ఏరియా కావడంతో ఇక్కడ స్థలానికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఉన్న కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం భవనం, స్థలం విలువ రూ.50కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ భవనం ఉన్న స్థలం గతంలో ప్రముఖ మిఠాయిల వ్యాపారి జి.పుల్లారెడ్డి వారిది. అప్పట్లో ఇందులో వారే ఓ చిన్న భవనాన్ని నిర్మించి ఆసుపత్రికి వచ్చే పేదరోగులు వంటావార్పు చేసుకుని, విశ్రమించే విధంగా నిర్వహించే వారు. ఇలాంటి ఈ స్థలాన్ని కొంతకాలానికి వారు ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చేశారు. 21 ఏళ్ల క్రితం వారే ఆసుపత్రి అధికారులతో చర్చించి ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ భవనం చుట్టూ దుకాణాలు ఉన్నాయి. మధ్యలో మాత్రం ఆసుపత్రికి వచ్చే రోగులు విశ్రమించే విధంగా గదులు నిర్మించారు. ఈ గదులను నామమాత్రపు రుసుముతో అద్దెకు ఇస్తున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ వచ్చే ఆదాయాన్ని నిర్వహణ ఖర్చులు పోను భవనం నిర్వాహకులకు 60శాతం, ఆసుపత్రికి 40శాతం ప్రకారం వచ్చేటట్లు అప్పట్లో నిర్వాహకులు 20 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నారు. ఈ ఒప్పందం ఇటీవల 2022 మార్చి 15వ తేదీతో ముగిసినట్లు పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు ఆసుపత్రి వర్గాలు నివేదించాయి.

పెద్దాసుపత్రికి నామమాత్రపు ఆదాయం

కసిరెడ్డి వెంకటరెడ్డి శ్యాలమ్మ సత్రం పేరిట ఉన్న ఈ భవనంలో ప్రధాన రహదారివైపున ఉన్న దుకాణాలకు ప్రస్తుతం నెలకు ఒక్కో దుకాణానికి రూ.10వేల చొప్పున(ఎన్ని దుకాణాలుంటే అన్ని రూ.10వేలు), వెనుక వైపున ఉన్న దుకాణాలకు ఒక్కో దానికి రూ.6వేల చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆసుపత్రికి లెక్కలు చూపారు. 20ఏళ్ల క్రితం ఉన్న అద్దెలను ప్రతి మూడేళ్లకు ఒకసారి పెంచుతూ వస్తుండటంతో ప్రస్తుతం ఈ అద్దెలు వసూలవుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో వ్యాపారి వారి వ్యాపారాన్ని బట్టి రెండు, మూడు, నాలుగు దుకాణాలను కలిపి తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఈ ప్రాంతంలో షాపుల అద్దె దీనికి రెండు, మూడింతలు ఉంటుందన్నది బహిరంగ రహస్యం. ఈ గదుల అద్దెలు, విశ్రాంతి గదుల ద్వారా వచ్చే ఆదాయం కలిపి ఏడాదికి రూ.7లక్షలు మాత్రమే ఆసుపత్రికి ఇస్తుండటం గమనార్హం.



ఆసుపత్రి ఎదురుగా ఉన్న కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం భవనం

భవనం అప్పగించేందుకు ససేమిరా..

కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం లీజు గడువు ముగిసి ఏడాది దాటింది. ఈ మేరకు భవనాన్ని తమకు స్వాధీనం చేయాలని ఆసుపత్రి అధికారులు ఏడాది క్రితమే నిర్వాహకులకు నోటీసులు పంపించారు. అప్పటి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సైతం ఈ విషయమై చర్చించారు. భవనాన్ని అప్పగించకుండా జి.పుల్లారెడ్డి ట్రస్ట్ వారే దానిని నిర్వహించేలా, వచ్చే ఆదాయంలో 25శాతం ట్రస్ట్‌కు, 75శాతం ఆసుపత్రికి చెందే విధంగా నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. కానీ ఏడాది దాటినా ఇప్పటి వరకు భవనాన్ని అప్పగించనూ లేదు. లేదా కొత్త ఒప్పందాన్ని అమలు చేయనూ లేదు. దీంతో ప్రతి యేటా ఆసుపత్రి తనకు రావాల్సిన ఆదాయాన్ని భారీగా కోల్పోతోంది.

జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

శాలమ్మ సత్రం భవనం తమకు స్వాధీనం చేయాలని ఏడాది క్రితమే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాము. ఈ విషయమై అప్పటి జిల్లా కలెక్టర్ వద్ద చర్చలు కూడా జరిగాయి. కానీ నిర్ణయం తాలూకు ఫైలు పెండింగ్‌లో ఉంది. జిల్లా కలెక్టర్ నుంచి వచ్చే ఆదేశాలను బట్టి నిర్ణయం తీసుకుంటాము. అది ఆసుపత్రికి చెందాల్సిన భవనం కాబట్టి తిరిగి ఇస్తే దానిని అభివృద్ధి చేసుకుంటాం.–**డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు**

మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం



జైలు శిక్ష ఖరారు కావడంతో మందుబాబులను సబ్ జైలుకు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు పాల్పడటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.నాగభూషణం హెచ్చరించారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడటం అవమానకరంగా భావించాలన్నారు. మద్యం మత్తులో మెదడు పనిచేయక, శరీరం ఆధీనంలో ఉండక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మత్తులో జరుగుతున్న ప్రమాదాలతో ఎంతమంది ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతుండగా మరికొందరి కుటుంబీకులు అనాథలుగా మారుతున్నాయన్నారు.

ఐదుగురికి జైలు శిక్ష...

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన శివకుమార్, ఆర్.బాలాజీ సింగ్, ఎం.వై.నరేష్, చిన్నబాబు, హరినాథ్‌ను మంగళవారం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో వారిని పంచలింగాల జైలుకు అప్పగించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

క్లుప్తంగా

దేవాలయ స్థలంకు వేలం

కర్నూలు కల్చరల్: కల్లూరు మండలం కల్లూరు శ్రీ ఈశ్వర వీరభద్ర, భీమేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి సంబంధించిన భూమి సర్వే నెం. 145, 293 ప్లాట్ నెం. 1,2,3,4లలో 4.03 ఎకరాల ఖాళీ స్థలానికి మంగళవారం ఆలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. రెండు సంవత్సరాల కాలానికి భారీ వాహనాలు నిలుపుకునేందుకు లీజుకు నిర్వహించిన వేలంలో టి. శివరామ కృష్ణ అనే వ్యక్తి అత్యధికంగా నెలకు రూ.65,000 చెల్లించేలా పాట పాడడంతో అతనికి దక్కింది. దేవదాయ శాఖ కర్నూలు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఈశ్వర వీరభద్ర భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవో గుర్రెడ్డి, ఈవోలు హనుమంతరావు, చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): స్థానిక ఖడక్‌పురలోని సయ్యద్ షాబుద్దీన్ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. మసీదులో ముస్లిం సోదరులతో కలసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, బాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ

కర్నూలు(సెంట్రల్): నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి.సృజనను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ పీజీఎస్ కల్యాణి మార్యద పూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టర్‌ను కలసి బొకేను అందజేసి తన శాఖలో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌లు, ఇతర అంశాలపై చర్చించారు.

నేడు ఎస్సీ కుల సంఘాల సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 14న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ నెల 12న ఎస్సీ కుల సంఘాలు, దళిత ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారి ఎస్.పి.ఎస్.ఎన్.రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వివిధ దళిత, కుల, ప్రజాసంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ డీఈ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా బుధవారపేట, కనకదుర్గమ్మ ఆలయం, విరుపాక్షయ్య తోట, బాబా బృందావన్ నగర్, ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియా, నిర్మల్ నగర్, గురురాఘవేంద్ర నగర్, ఠాగూర్ నగర్, గోపినగర్, యాదవ నగర్, విద్యుత్ ఎంప్లాయీస్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..ఇటీవల కార్మికుల వేతనాలు పెండింగ్ విషయమై మంత్రి గుమ్మనూరు జయరాంతో చర్చించామన్నారు. 12 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

కర్నూలు(సెంట్రల్): మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ తుది గడువు ఉందన్నారు. బ్యాంకు ఖాతా, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులను సమకూర్చుకోవడానికి సమయం సరిపోవడంలేదని, సమయాన్ని మరో నెలపాటు పొడిగించాలని ఆమె కోరారు.

భూములను కాపాడండి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ, దేవదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె. జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కలెక్టర్ జి.సృజనను కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఆమెకు వినతిపత్రం సమర్పించారు.

జెండావిష్కరణ

కర్నూలు(సెంట్రల్): అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు మండలం ఉల్చాలలో ఏపీ రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఘనంగా మహాత్మా పూలే జయంతి
- బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత: కాటసాని, రామయ్య



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్)/కల్లూరు: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మ జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని వైఎస్‌ఆర్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బీవై రామయ్య అన్నారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్ ఆవరణలోని పార్టీ కార్యాలయంలో పూలే 197వ జయంతి వేడుక నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటిన్నర శతాబ్దం క్రితం సమాజంలో వెనుకబడిన బలహీన వర్గాల సంక్షేమం, బాగు కోసం పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. విద్య, ఉపాధి, సామాజికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడ్డారని చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా శ్రమించిన మహాత్ముడు పూలే అన్నారు. ఆయన ఆశయ సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఆయన చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి ఎంతో మంది బలహీన వర్గాలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చిన నాయకుడన్నారు. బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్ అని చెప్పి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టు పనుల్లో 50శాతం కేటాయించేందుకు చట్టం తెచ్చి, పకడ్బందీగా అమలు చేస్తూ దేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు. తాజాగా మంత్రివర్గ విస్తరణలో కూడా బీసీ, బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పూలే ఆశయ సాధన ఆయనతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దయ్య, ధనుంజయ ఆచారి, సుభాష్ చంద్రబోస్, శ్వేతారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో జరిగిన పూలే జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సృజన హాజరై పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జయరాముడు, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య భవనంలో పూలే చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు జే లక్ష్మినరసింహ యాదవ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరిజన బాలస్వామి, నాయకులు పఠాన్ హబీబ్ ఖాన్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



పూలే జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(అర్బన్): నూట యాభై సంవత్సరాలకు పూర్వమే అవిద్య, అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించిన బహుజనుల స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు కొనియాడారు. జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా మంగళవారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక బిర్లాగేట్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో పూలే చిత్రపటానికి జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ లు జితేంద్ర, రాంగోపాల్, మురళీమోహన్‌రెడ్డి, బసవశేఖర్, సరస్వతి పాల్గొన్నారు.

కురువ సంఘం ఆధ్వర్యంలో ...

జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నేతలు జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, నాయకులు తిరుపాలు, తవుడు శ్రీనివాసులు, బీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌లో ...

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్ ప్రాంగణంలో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జాతీయ కురుమ, కురుబ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు కురువ నాగేష్, యాదవ హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అయ్యన్నయాదవ్, గౌడ సంఘం నాయకులు హేమంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

కర్నూలు(సెంట్రల్): జ్యోతిరావు జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు నేతృత్వంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దామోదరం రాధాకృష్ణ, నాయకులు పోతుల శేఖర్, అమరేంద్ర రెడ్డి, షేక్ ఖాజా హుస్సేన్, రాజేంద్రప్రసాద్, తిక్కస్వామి, శివానంద్ పాల్గొన్నారు.


సీఐటీయూ ఓల్డ్‌సిటీ, ఆవాజ్ కమిటీల ఆధ్వర్యంలో సుర్జీత్‌సింగ్ భవన్‌లో అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, మారేళ్ల విజయ్ పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో వర్సిటీ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చ, మాజీ రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మలు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ డా.ఎం.ఈ రాణి, ఆచార్యులు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


- ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. వేడుకల్లో కాలేజీ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పెద్దక్క, గ్రంథాలయాధికారులు గోవిందరెడ్డి, బాష, తదితరులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామస్వామి, కాశింగి నరసింహ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, వెంకట హరి తదితరులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బిర్లాగేట్ దగ్గర ఉన్న పూలే విగ్రహానికి వీహెచ్‌పీ నాయకులు నివాళులర్పించారు. నగర అధ్యక్షులు మద్దిలేటి, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు: పూలే జయంతి వేడుకలను టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, అధికార ప్రతినిధి పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీజీ భరత్, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.



జెడ్పీలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఈఓ, సిబ్బంది



నివాళులర్పిస్తున్న ఆర్‌యూ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు



ఆటోలకే 'చలువ'

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో బస్ షెల్టర్ల వద్ద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా మున్సిపల్ అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అయితే సి.క్యాంప్ సెంటర్‌లో ఈ చలువ పందిళ్లు వాహనాలకు నీడనిస్తున్నాయి. ఆటోలను అడ్డదిడ్డంగా ఆపుతుండటంతో యథాతథంగా ప్రజలు ఎండలో నిల్చోక తప్పని పరిస్థితి నెలకొంది. అసలే భానుడు ఉగ్రరూపం దాలుస్తుండగా ఆటోడ్రైవర్ల ఇష్టారాజ్యం ప్రజలు చెమటలు కక్కేందుకు కారణమవుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

అజీముద్దిన్ మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని కప్పల్‌నగర్ సమీపంలోని అజీముద్దిన్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి మసీదు పెద్దలతో కలసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు మౌలాలి, సయ్యద్ అమీర్, పార్టీ నాయకులు పర్వేజ్, ఇర్ఫాన్, ప్రభుదాస్, రియాజ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

కర్నూలు (టౌన్): స్థానిక కృష్ణానగర్ ఐటీసీ వద్దకు సోమవారం అర్ధరాత్రి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను తరలిస్తున్న వాహనాన్ని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పట్టుకున్నారు. రూ.2 లక్షలు విలువ చేసే ప్లాస్టిక్ వస్తువులు తరలిస్తున్నట్లు ఆయనకు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. అప్రమత్తమైన ఆయన కృష్ణానగర్ ఐటీసీ వద్ద సోదాలు చేయడంతో ప్లాస్టిక్ వస్తువులు బయటపడ్డాయి. కల్లూరులోని ఓ వ్యాపారి వీటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటికే నాలుగు సార్లు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న ఈ వ్యాపారిపై కేసులు నమోదు చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను నిషేధించినా కొంత మంది వ్యాపారులు క్రయ విక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పారిశుద్ధ్యం సిబ్బందితో కలిసి దాడులు చేసి భారీ జరిమానాలు, ట్రేడ్ లైసెన్సులను రద్దు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన మంగళవారం సాయంత్రం 'సాక్షి'కి తెలిపారు.

13న ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 13వ తేదీన కృష్ణ పక్షం అష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు కాల భైర హోమం, దత్తాత్రేయ స్వామికి అనఘాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



దివ్యాంగులకు వాహనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి మంజూరైన 10 నూతన త్రిచక్ర వాహనాలను వారు అర్హులైన దివ్యాంగులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 లక్షల వ్యయంతో ఇచ్చిన త్రిచక్ర వాహనాలతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయి ఎవరిపై ఆధారపడకుండా జీవించే అవకాశం లభిస్తుందన్నారు. స్థానికంగా వాహనాలను వినియోగిస్తూ అన్ని రకాల పనులు చేసుకోవడానికి అనువుగా త్రిచక్రవాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాగా, వాహనాలను నడిపేసమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాంగుల శాఖ ఏడీ విజయ, ఆర్‌టీఓ రమేష్ పాల్గొన్నారు.